

మా నమ్మకం నువ్వేనన్నా..
బుధవారం మధ్యాహ్నం రొంపిచర్ల మండల కేంద్రంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన స్థానికులు, కార్యకర్తలు, అభిమానులు



జగనన్న కోసం.. పిడుగురాళ్ల సభకు ఆర్టీసీ బస్సుల్లో తరలివస్తున్న వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు



జననేతకు గజమాలతో... రొంపిచర్ల మండలం మీదుగా సిద్ధం సభకు వెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గజమాలతో ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉన్న స్థానికులు, కార్యకర్తలు, అభిమానులు



జగనన్నా.. నమస్తే అన్నా.. ముఖ్యమంత్రిని చూసి ఆనందం వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ప్రయాణికులు

సభకు మేమంతా సిద్ధం



నరసరావుపేటలోని తొమ్మిదో వార్డు నుంచి...



చిలకలూరిపేటలో జెండా ఊపి ఆరంభిస్తున్న కావటి..



గణపవరం నుంచి ...



నాదెండ్ల నుంచి...



గణపవరం నుంచి ....



యడ్లపాడు నుంచి...



కారుచోల నుంచి...



బోయపాలెం నుంచి..



కొత్తపల్లి గ్రామం నుంచి..

దారులన్నీ పిడుగురాళ్లలో నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం సభవైపుకు మళ్లాయి. జై జగన్ నామస్మరణతో దిక్కులు పిక్కటిల్లాయి. వీధులు, గ్రామాలలో వైఎస్సార్ సీపీ పతాకాలు రెపరెపలాడాయి. ఎటు చూసినా మేమంతా సిద్ధం సభకు తరలివెళ్లే ప్రజానీకంతో వీధులు కోలాహలం సంతరించుకున్నాయి. చిలకలూరిపేట, నరసరావుపేట, శావల్యాపురం, వినుకొండ, బొల్లాపల్లి, నాదెండ్ల, ఈపూరు, రొంపిచర్ల మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి సభకు భారీగా తరలివెళ్లారు. ద్విచక్ర వాహనాలపై యువత జెండాలు పట్టుకుని సభకు తరలివెళ్లడం కనిపించింది.

- సాక్షి నెట్‌వర్క్

జననేతా.. నవరత్నప్రదాతా..

- గజమాలతో స్వాగతం పలికిన గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు
- ఎర్రని ఎండలో సైతం జగనన్నను చూసేందుకు ఉత్సాహం చూపించిన పండుటాకులు
- సీఎం జగన్‌తో పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ అనీల్, డాక్టర్ గోపిరెడ్డి



రొంపిచర్ల వద్ద ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మండల వాసులు, కార్యకర్తలు, నేతలు

నరసరావుపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్ర వేలాదిమంది ప్రజల జేజేలు, నీరాజనాల మధ్య బుధవారం నియోజకవర్గంలో కొనసాగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా వినుకొండ నియోజకవర్గంలోని శావల్యాపురం మండలం గంటావారిపాలెం నుంచి ప్రారంభమైన సీఎం జగన్ బస్సుయాత్ర సంతమాగులూరు మండలం క్రాస్‌రోడ్స్ నుంచి కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై నున్న అన్నవరప్పాడు, సుబ్బయ్యపాలెం, రొంపిచర్ల, సంతగుడిపాడు, మర్రిచెట్టుపాలెం, విప్పర్ల, నకరికల్లు అడ్డరోడ్డు మీదుగా ముందుకు కొనసాగింది. సుమారు 42 డిగ్రీల ఎండవేడిని సైతం లెక్క చేయకుండా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పిల్లా పాపలతో తల్లులు, మహిళలు, వృద్ధులు, యువతీ యువకులు, విద్యార్థినీ విద్యార్థులు, కార్మికులు, రైతులు, రైతుకూలీలు, వ్యాపారులు వేలాదిమంది జెండాలు చేబూని జేజేలు కొడుతూ రోడ్లపై నిలబడి ఘన స్వాగతం పలికారు. మర్రిచెట్టుపాలెం, విప్పర్ల వద్ద ఉదయం పది గంటల నుంచే ఎర్రని ఎండలో జగన్‌కోసం ఎదురుచూడటం కన్పించింది. పలు గ్రామాలకు చెందిన వారి ఆదరాభిమానాల మధ్య సుమారు మధ్యాహ్నం 2.15 సమయంలో ఆ ప్రదేశానికి సీఎం జగన్ బస్సుయాత్ర చేరుకుంది. సీఎం జగన్‌తో పాటు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు డాక్టర్ అనీల్ కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు పలువురు నాయకులు బస్సులో కొనసాగారు.

శావల్యాపురం నుంచి సిద్ధం సభకు...

శావల్యాపురం: మేమంతా సిద్ధం 12వ రోజు జరిగిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బస్‌యాత్ర కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. బుధవారం పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం గ్రామ సమీపంలో జాతీయ రహదారి వెంబడి బస ముగించుకొని పిడుగురాళ్లలో జరగనున్న భారీ బహిరంగ సభకు బస్ యాత్ర ద్వారా బయలు దేరారు. ఈసందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బస చేసిన ప్రాంగణానికి ఉదయం 7 గంటల నుంచి జన సంద్రంగా మారింది.

ఎక్స్‌ప్రెస్‌వేపై జగనన్నినాదం

రొంపిచర్ల: ఎన్నికల పర్యటనలో భాగంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సు యాత్ర బుధవారం మండలంలో కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై జైత్రయాత్రలా సాగింది. పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గంలోని శావల్యాపురం మండలం గంటావారిపాలెం నుంచి మేమంతా సిద్ధం బస్సుయాత్రను సీఎం జగన్ ప్రారంభించారు. అక్కడి నుంచి బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం అడ్డరోడ్డు చేరుకొని వేలాది మంది అభిమానుల స్వాగత సత్కారాల మధ్య బస్సుయాత్ర రొంపిచర్ల మండలం అన్నవరప్పాడులోకి ప్రవేశించింది. మండలానికి వచ్చిన సీఎం జగన్‌కు ఆ ప్రాంత ప్రజలు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. ప్రత్యేకంగా తయారుచేయించిన గజమాలలను క్రేన్‌సహాయంతో ఆయనకు అలంకరించారు. బస్సుయాత్ర వస్తుండటం గమనించిన ప్రజలు కేరింతలు కొట్టారు. అభిమానులు తమ అభిమానాన్ని పలు విధాలుగా చాటుకున్నారు. ఆ అభిమాని తన గొర్రెల మందలోని గొర్రెపిల్లను సీఎం జగన్‌కు బహుమతిగా అందజేశారు. అలాగే వీరవట్నం గ్రామానికి చెందిన మరో అభిమాని తన కన్న చంటిబిడ్డను జగన్‌కు అందజేయటంలో ముద్దాడారు. అన్నవరప్పాడు గ్రామానికి చెందిన రైతులు తమకు వచ్చే మేజరు కాలువకు సిమెంట్ లైనింగ్ చేయించాలని వినతిపత్రం అందజేశారు. పక్షవాతంతో బాధపడుతూ జగన్‌ను చూసేందుకు వచ్చిన నందిగల కోటిరెడ్డిని ఆప్యాయంగా పలకరించారు. ఐదు గుమ్మడికాయలతో మహిళలు జగన్‌కు దిష్టి తీశారు. జగన్‌ను చూసిన మహిళలు కేరింతలు కొడుతూ నృత్యం చేశారు. రెండోసారి సీఎం కావాలని జగనన్నే రావాలని నినాదాలు చేశారు. పలు గ్రామాల్లో క్రేన్‌ల సహాయంతో గజమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. జేసీబీలలో పెద్ద ఎత్తున పూలను తీసుకొచ్చి జననేతపై చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అన్నవరప్పాడులో మహిళలు బస్సు యాత్రకు గుమ్మడి కాయలతో దిష్టి తీశారు.

భారీ గజమాలతో..



వడియరాజుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గజమాల

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఆయనకు స్వాగతం పలికేందుకు వడియరాజులు ఏర్పాటు చేసిన గజమాల ప్రజలను ఆకట్టుకుంది. వడియరాజుల ఆధ్వర్యంలో భారీ గజమాలను క్రేన్ సహాయంతో జగన్‌మోహన్‌రెడ్డికి అలంకరించారు. ఈ కార్యక్రమానికి బత్తుల రామకృష్ణ, ఒంటిపులి వీరాంజి, బండారు శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, సుబ్బారెడ్డి, బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.



మర్రిచెట్టుపాలెం వద్ద సీఎం జగన్ కోసం ఎదురు చూస్తూ జెండాలు ఊపుతున్న మహిళలు



రొంపిచర్ల వద్ద సీఎం జగన్‌ను చూసేందుకు చిన్నారులతో వచ్చిన మహిళలు



అన్నవరప్పాడు వద్ద జగనన్నకు స్వాగతం పలికి మా తొలిఓటు జగన్‌కే అంటున్న యువతులు

ప్రజాభిమానం మరువలేనిది

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వితంరాజుపల్లిలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి నియోజకవర్గంలో తలపెట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు స్థానికులు చూపిన అభిమానం మరువలేనిదని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి వినుకొండ రూరల్ మండలం వితంరాజుపల్లిలో ఆయన ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. వితంరాజుపల్లి గ్రామం అభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రిని కోరగా రానున్న రోజుల్లో వితంరాజుపల్లికి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మంజూరు చేస్తామని, గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బస్సు యాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడంతో టీడీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జగన్‌రెడ్డి అంటూ ఏకవచనంతో సంబోధించడాన్ని తప్పుబట్టారు. ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి జీవీకి లేదన్నారు. ఎన్ని పార్టీలు కట్టకట్టుకొని వచ్చినా రానున్న ఎన్నికల్లో విజయం తమదేనన్నారు. ఎంపీపీ జయశ్రీ వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు దిగజారిపోయి మాట్లాడుతున్నారని, గతంలో వైఎస్సార్ సీపీలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు లాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. వారి వల్లే అభివృద్ధి సాధ్యమని మాట్లాడి, ప్రస్తుతం టీడీపీ కండువా కప్పుకున్న ఆయన వారిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. మక్కెన రాజకీయ జీవితం ప్రజలందరికీ తెలుసని, రానున్న రోజుల్లో ప్రజలు సరైన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి జగనన్న పాలన

- ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్ నాయుడు



ఎన్నికల ప్రచారంలో కావటి మనోహర్‌నాయుడు

చిలకలూరిపేట: ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి పారదర్శక పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. పట్టణంలోని 38వ వార్డులో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా వార్డు పరిధిలోని ఆరాధన చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి మదర్‌థెరిస్సా కాలనీ, ఆరిఫుల్లా నగర్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మనోహర్ నాయుడు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటికే పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా వార్డు, గ్రామ సచివాలయాలు వలంటీర్ వ్యవస్థను రాష్ట్రంలో ప్రవేశపెట్టి పలు రాష్ట్రాలకు ఆదర్శంగా ఏపీని నిలిపిన ఘనత జగనన్నదేనన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో దేశంలోనే అత్యుత్తమ సేవలు ప్రజలకు అందించిన రాష్ట్రంగా ఏపీ నిలిచి దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకోవడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మస్తాన్‌వలి, తియ్యగూర అంజిరెడ్డి, బాలకోటినాయక్, అంజిబాబు నాయక్, కుప్పాల శంకర్, ఎండీ జిలాని, హరిదాసు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తెలంగాణ వాసి మృతి

చిలకలూరిపేట టౌన్: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందిన సంఘటన చిలకలూరిపేట మండలం పరిధిలో నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం సాలపల్లి గ్రామానికి చెందిన దాసరి నరేష్‌కుమార్ మార్టూరు మండలం బల్లికురవ, ఉప్పుమాగులూరులోని గ్రానైట్ ఫ్యాక్టరీల్లో అసిస్టెంట్ మార్కర్‌గా కొద్దికాలంగా పని చేస్తున్నాడు. ఈనెల 9వ తేదీన నరేష్ కుమార్ బైక్‌పై చిలకలూరిపేట వైపుకు వస్తున్న క్రమంలో తాతపూడి గ్రామం అండర్‌పాస్ వంతెన వద్ద రాత్రి 10 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం అతని బైక్‌ను ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో నరేష్‌కుమార్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య అఖిల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని రూరల్‌పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రంజాన్ పర్వదినం



నరసరావుపేట ఈస్ట్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధ వారం నెలపొడుపు కనపడటంతో గురువారం రంజాన్ పర్వదినాన్ని నిర్వహించేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ప్రకాష్‌నగర్‌లోని ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

విధి ఆడిన 'ఆట'లో ఓడిపోయిన దిలీప్

- తోటి స్నేహితులతో ఆటలాడుతూ కుప్పకూలి విద్యార్థి మృతి
- ఆరేళ్ల క్రితం తల్లిదండ్రులను బలి తీసుకున్న రోడ్డు ప్రమాదం
- నాడు గాయాలతో బయటపడ్డ బాలుడు
- ఆరేళ్లుగా వెంటాడిన అనారోగ్య సమస్యలు



దిలీప్ కుమార్ (ఫైల్)

నాదెండ్ల: అప్పటి వరకూ తోటి స్నేహితులతో సరదాగా ట్రాంపోలిన్‌పై గంతులేసిన చిన్నారి ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు విడిచిన విషాద సంఘటన నాదెండ్ల మండలం, సాతులూరు గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మేకపోతుల మహాలక్ష్మి, వెంకటేష్ దంపతుల కుమారుడు గోవిందు దిలీప్‌కుమార్ (15) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. గ్రామంలో మంగళవారం రాత్రి రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ట్రాంపోలిన్ ఏర్పాటు చేశారు. రాత్రి 9.30 గంటల సమయంలో తోటి స్నేహితులతో కలిసి దిలీప్‌కుమార్ ఆటలాడాడు. ట్రాంపోలిన్ దిగిన కొద్ది నిమిషాలకే కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న హైస్కూలు హెచ్‌ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు బాలుడి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

రెండో విషాదం...

ఆరేళ్ల క్రితం దిలీప్‌కుమార్ తల్లిదండ్రులు మహాలక్ష్మి, వెంకటేష్‌లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ద్విచక్రవాహనంపై కుమారుడు దిలీప్‌కుమార్‌ను తీసుకుని దంపతులు వెళ్తుండగా, మరో వాహనం ఢీకొంది. దంపతులు ఇరువురూ మృతి చెందగా, దిలీప్‌కుమార్ తీవ్రగాయాలపాలయ్యాడు. ప్రమాదంలో గుండె, పలు శరీరభాగాలకు తీవ్ర గాయాలవగా అప్పటి నుంచి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు.

తల్లిదండ్రులు మృతి అనంతరం దిలీప్‌ను సాతులూరు గ్రామానికి చెందిన నాయనమ్మ రమణమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. రమణమ్మ కూలి పనులు చేసుకుని పోషిస్తోంది. ప్రస్తుతం ఎనిమిదో తరగతి పూర్తి చేసుకుని, వచ్చే విద్యా సంవత్సరంలో దిలీప్ కుమార్ చేరాల్సి ఉంది. గతంలో తన కుమారుడు, కోడలు, ఇప్పుడు మనవడు మృతి చెందటంతో రమణమ్మ శోకసంద్రంలో మునిగింది.

జననేత కోసం పనులు ముగించుకొని..



జగనన్న కోసం ఎదురు చూస్తున్న మిర్చి కోత కూలీలు

నరసరావుపేట ఈస్ట్: భానుడి లేత కిరణాలు భూమిని తాకక ముందే వారంతా మిరపకోతలకు ఉపక్రమించారు. ప్రతిరోజు ఉదయం 6.30 గంటలకు మిర్చి పొలంలోకి అడుగుపెట్టే రైతు కూలీలు జననేత జగనన్న చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర తమ ఊరి మీదుగా సాగుతుందని తెలుసుకుని మసక చీకట్లలోనే పొలాలకు చేరుకున్నారు. వడివడిగా మిరప కోత పనులు పూర్తి చేరుకుని ఆయనను చూసేందుకు రోడ్డెక్కారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఆయన కోసం ఎదురుచూశారు. మధ్యాహ్నం 12.45 గంటలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి కాన్వాయ్ రొంపిచర్ల మండలం వడ్లమూడివారిపాలెం గ్రామ పరిధిలో అద్దంకి- నార్కెట్‌పల్లి రోడ్డుపైకి రాగానే జగనన్నకు జేజేలు కొడుతూ అభివాదం చేశారు.



చకచకా..

రంజాన్ పండుగను పురస్కరించుకొని చిలకలూరి పేటలోని అడ్డరోడ్డు సెంటర్ ఈద్గా మైదానం వద్ద పారిశుద్ధ్య పనులను బుధవారం నిర్వహించారు. ప్రతి ఏటా ఇక్కడనమాజు కోసం వేలాదిగా ముస్లింలు హాజరౌతారు. -చిలకలూరిపేట

ఆర్.సి. నెం. 576/ 88-89 మైరాడా ప్రాజెక్ట్ తేది : 11-04-2024
మైరాడా వినుకొండ ప్రాజెక్టు వారు ప్రకటించిన టెండరు
టెండర్ ప్రకటన
టెండరు నెం. MYVNK/2024-25
పల్నాడు మరియు ప్రకాశం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామముల పరిధిలో మేము చేయుచున్న యస్.యం.సి.పి ప్రోగ్రాం నందు గల ఎర్త్ వర్క్స్ (మట్టి కట్టలు, చెరువుల పూడిక తీత, ఫారం పాండ్స్, సంకన్ పాండ్స్, చెరువుల మరమ్మతులు, కొత్త నిర్మాణం వగైరా) పనులు మిషనరీతో మరియు స్టోన్ వర్క్ (LSS, RFD, SB, REVITMENT పనులు) చేయుటకు అనుభవం, మిషనరీ గల కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరడమైనది. ఇతర వివరములకు ప్రోగ్రామ్ ఆఫీసర్, మైరాడా వినుకొండ ప్రాజెక్టు నందు సంప్రదించగలరు. సెల్ నెం. 9701997960
టెండరు ప్రారంభం తేది 11-04-2024,
టెండరు ముగింపు తేది. 18-04-2024 మధ్యాహ్నం గం॥ 12-30ని॥లకు,
సీల్డ్ టెండర్లు తెరచు తేది. 20-04-2024 ఉదయం గం॥11-00ని॥లకు
గమనిక: షరతులు వర్తిస్తాయి మరియు సీల్డ్ టెండర్లు రిజిస్టరు పోస్టు ద్వారా మాత్రమే స్వీకరించబడును.
సం/- ప్రోగ్రాం ఆఫీసర్, మైరాడా వినుకొండ ప్రాజెక్టు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com